క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


మురుగు నీటిలో దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తున్న దృశ్యం

రుద్రవరం: సీజనల్ వ్యాధుల పట్ల గ్రామీణ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరరావు సూచించారు. మండల కేంద్రంలో పలు కాలనీల్లో కలియతిరిగి పారిశుద్ధ్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రైనేజీ లేకపోవడంతో అక్కడక్కడా వర్షపు నీరు నిల్వ ఏరడిపడి మురుగుగా మారిందన్నారు. ఆ నీటిలో దోమల వ్యాప్తి చెందకుండా పారిశుద్ధ్య కార్మికులతో క్రిమీ సంహారక మందు పిచికారీ చేయించామన్నారు. ప్రజలు ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, రాత్రిళ్లు నిద్రించే సమయంలో దోమతెరలు వాడాలని సూచించారు. స్థానిక పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పుపై హర్షం


చాగలమర్రిలో సంబరాలు చేసుకుంటున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

చాగలమర్రి: ఎస్సీ ఉమ్మడి రిజర్వేషన్లలో ఏబీసీడీ వర్గీకరణపై ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలకు అధికారం కల్పిస్తూ సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల ధర్మాసనం గురువారం వెలువరించిన తీర్పుపై హర్షం వ్యక్తం చేస్తూ చాగలమర్రిలో ఎంఆర్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వేణుగోపాల్, స్థానిక నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. 30 ఎళ్ల సుదీర్ఘ న్యాయ పోరాటం ఫలించిందని, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వర్గీకరణకు హామీ ఇచ్చారన్నారు. నాయకులు గన మద్దిలేటి, గద్ద రాజు, ప్రకాష్, చెంచుగాళ్ల జోసెఫ్, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జియారత్ వేడుకలు


గోనంపల్లెలో దస్తగిరి స్వామి పీరుకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

రుద్రవరం: మండల పరిధిలోని గోనంపల్లెలో గురువారం దస్తగిరి స్వామి పీరుకు భక్తిశ్రద్ధలతో జియారత్ వేడుకలు నిర్వహించారు. మోహర్రం వేడుకలు ముగిసిన 21 రోజులకు జియారత్ వేడుకలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా గ్రామ పెద్దలు, నిర్వాహకులు పీర్ల చావిడిని విద్యుద్దీపాలతో అలంకరించారు. గ్రామస్తులు మేళతాళాలతో పూల సూచికాలు తీసుకెళ్లి స్వామి వారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. జియారత్ వేడుకల సందర్భంగా చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి ఫాతెహాలు సమర్పించారు. అనంతరం పీరుకు గామోత్సవం నిర్వహించారు.

పులికొండన్న అరెస్ట్ అన్యాయం


మాట్లాడుతున్న నాగేశ్వరరావు

నంద్యాల(అర్బన్): వాల్మీకి ఉద్యమ నేత ఎంవీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు బోయ పులికొండన్నను పోలీసులు అరెస్ట్ చేయడం అన్యాయమని సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు ఖండించారు. 25 రోజులవుతున్నా ముచ్చుమర్రి మైనర్ బాలిక ఆచూకీని కనుగొనలేకపోవడం సిగ్గుచేటన్నారు. ఇదే విషయమై సీఎం చంద్రబాబు పర్యటనను అడ్డుకుంటారన్న ఉద్దేశంతో పులికొండన్నను అరెస్ట చేయడం తగదన్నారు. ఇలాంటి ఘటనలకు పాల్పడితే వాల్మీకి సమాజం ఊరుకోదని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు లాయర్ సుబ్బరాయుడు, పరమేష్ పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకుందాం


మాట్లాడుతున్న శివప్రసాద్

నంద్యాల(అర్బన్): ఈనెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకుందామని గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి శివప్రసాద్, జీఎస్ రాష్ట్ర అధ్యక్షులు రాజునాయక్ అన్నారు. స్థానిక కార్యాలయంలో గిరిజన సంఘం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో ఆదివాసి దినోత్సవాల్లో గిరిజనుల సాంప్రదాయ నృత్యాలు ఉంటాయన్నారు. జిల్లాలోని గిరిజనులందరూ వేడుకలకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు హుసేనయ్య, స్వామినాయక్, బాలనాయక్, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

అడ్మిషన్లు నిల్

- జెడ్పీ హైస్కూళ్లలో ఇంటర్మీడియెట్‌కు స్థాయి పెంపు
- రెండు నెలలు గడిచినా ఒక్క అడ్మిషన్ లేదు
- ప్రశ్నార్థకంగా ఇంటర్ విద్య
- ప్రైవేటు విద్యాసంస్థలను ఆశ్రయించిన విద్యార్థులు


దొర్నిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇంటర్ అడ్మిషన్లపై ఏర్పాటు చేసిన బ్యానర్

దొర్నిపాడు: దూరప్రాంతంలోని పట్టణాలకు వెళ్లి ఇంటర్మీడియెట్ చదివేందుకు ఇబ్బందులు పడుతున్న విద్యార్థుల కోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మండల కేంద్రాల్లోని ఉన్నత పాఠశాలల్లో హైస్కూల్ ప్లస్ చేస్తూ ఇంటర్మీడియెట్ విద్యకు అవకాశం కల్పించింది. కో–ఎడ్యుకేషన్ విధానంలో విద్యను బోధించేందుకు వెసులుబాటు కల్పించింది. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపుల ఏర్పాటుకు అధికారులు అనుమతులు ఇచ్చారు. అయితే అధికారులు సరైన ప్రచారం కల్పించకపోవడం, నిర్లక్ష్యం, అలసత్వం కారణంగా అడ్మిషన్లు లేక ఈ ఏడాది ఆయా కేంద్రాల్లో ఇంటర్ విద్య ప్రశ్నార్థకంగా మారింది.

పదిలో 213 మంది ఉత్తీర్ణత

మండలంలోని భాగ్యనగరం, డబ్ల్యూ కొత్తపల్లె, దొర్నిపాడు ఉన్నత పాఠశాలలతో పాటు అమ్మిరెడ్డి నగరం కస్తూర్బా గాంధీ విద్యాలయం ఉంది. 2023–24 విద్యా సంవత్సరంలో నాలుగు స్కూళ్ల నుంచి 213 మంది విద్యార్థులు పదో తరగతి చదివి ఉత్తీర్ణులై బయటకు వచ్చారు. వీరిలో కనీసం ఒక్కరైనా స్థానికంగా ఇంటర్ చదివేందుకు సుముఖత చూపడం లేదు.

ఎక్కడ లోపం జరిగింది ?

మండల కేంద్రం దొర్నిపాడు నుంచి ఇంటర్ చదవాలంటే కోవెలకుంట్ల, ఆళ్లగడ్డ పట్టణాలకు వెళ్లాల్సి వస్తుంది. రెండు ప్రాంతాలు దొర్నిపాడు నుంచి 15 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. విద్యార్థులు ఇక్కడే ఇంటర్మీడియెట్ చదివేలా స్థానిక ఉపాధ్యాయులు కాస్త ప్రయత్నాలు చేసినా ఫలితం లేకపోయింది. ఉన్నతాధికారులు చొరవ తీసుకొని పదో తరగతి పూర్తి చేసుకున్న వారు ఇక్కడే ఇంటర్మీడియెట్ చదువుకునేందుకు అవకాశం ఉందని సూచిస్తూ ఉత్తర్వులు జారీ చేసి ఉంటే తప్పనిసరిగా అడ్మిషన్లు ఫుల్ అయ్యేవని స్థానికులు మాట. మండలంలో 213 మంది విద్యార్థులను పెట్టుకొని ఒక్క అడ్మిషన్ కూడా చేయించుకోలేకపోవడం బాధాకరం. ఎవ్వరూ పట్టించుకోకపోవడంతోనే ఇలా జరిగిందని విమర్శలు వినిపిస్తున్నాయి.

ఎన్నో సందేహాలు

తల్లిదండ్రులు తమ పిల్లలను స్థానికంగా ఇంటర్‌లో చేర్పిద్దామనుకుంటే కళాశాలలో మొత్తం ఎంత మంది విద్యార్థులు చేరుతారో స్పష్టత లేదు. దీంతో తల్లిదండ్రులు అయోమయంలో పడ్డారు. ఎవరైనా చేరితే తర్వాత చేరొచ్చులే అని చాలా మంది వేచి చూసి పట్టణాలకు వెళ్లిపోయారు. జూన్ 1 నుంచి అడ్మిషన్లు ప్రారంభం కాగా రెండు నెలలు గడిచినా ఇంటర్మీడియెట్‌లో ఒక్క అడ్మిషన్ కూడా జరగలేదు.

ఫ్యాకల్టీ భయంతోనే..

మండలకేంద్రం దొర్నిపాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేసే కార్యక్రమంలో భాగంగా హెచ్‌ఎం చర్యలు చేపట్టారు. ఫ్యాకల్టీ లేకపోవడంతో విద్యార్థులు ప్రైవేటు విద్యా సంస్థలను ఆశ్రయించారు. అడ్మిషన్లు లేకపోవడంతో ఇక ఇక్కడ ఇంటర్ లేనట్లేనని తెలుస్తుంది.


ఇంటర్ తరగతుల కోసం రూ.1.50 కోట్లతో నిర్మించిన నూతన భవనాలు

అవగాహన కల్పించాం



గ్రామంలోనే ఇంటర్ కళాశాలకు అనుమతి లభించడం అదృష్టం అని విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాం. టీసీ కోసం వచ్చిన విద్యార్థులకు స్థానికంగానే ఇంటర్ చదువుకోవచ్చని వివరించాం. ఎవ్వరు చేరనప్పుడు కళాశాల నిర్వహణ ఎలా సాధ్యం అవుతుందని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. తరగతి గదులు, ల్యాబ్‌లు, అన్ని ఏర్పాటు చేశాం. వచ్చే ఏడాది విస్తృత ప్రచారం నిర్వహించి ఇంటర్మీడియట్ ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.

–శ్రీనివాసరావు, హెచ్‌ఎం, దొర్నిపాడు

ఎవ్వరు లేకనే రెసిడెన్షియల్‌లో చేరాను



నేను దొర్నిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలోనే పదో తరగతి వరకు చదివాను. ఇక్కడే ఇంటర్మీడియెట్ కూడా చదువుకోవచ్చని ఆశపడ్డాను. అయితే కళాశాలలో ఎవ్వరూ చేరకపోవడంతో శ్రీశైలంలోని రెసిడెన్షియల్‌కు వెళ్లిపోయాను. కళాశాల నిర్వహణకు అనుమతి వచ్చిందని మాదే ఫస్ట్ బ్యాచ్ అని సంబరపడేలాగా ఇలా జరిగింది. ఇంటర్మీడియెట్‌కు అనుమతి వచ్చినా ఫలితం లేకపోయింది.

–యశ్వంత్, ఇంటర్ విద్యార్థి, దొర్నిపాడు

విద్యార్థులు చేరతారని అనుకున్నాం



స్థానికంగానే ఇంటర్మీడియెట్ చదవుకునేందుకు అవకాశం ఉందని విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు చెప్పాం. ఇక్కడే చదివితే కళాశాల సుస్థిరం అవుతుందని అవగాహన కల్పించాం. అధ్యాపకులు లేరని, పట్టణాల్లో అన్ని వసతులు ఉన్న కళాశాలల్లో చదివితేనే పిల్లలు ఉత్తీర్ణత కావడం కష్టంగా ఉందని, అలాంటప్పుడు ఈ కళాశాలలో ఎలా చదివించాలని ప్రశ్నించారు.

–నర్సిరెడ్డి, పీఎంసీ చైర్మన్, దొర్నిపాడు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయ సిబ్బంది

చాగలమర్రి: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రూతు, సమీర రాష్ట్రస్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ఎం.కోటయ్య తెలిపారు. గురువారం పాఠశాలలో నిర్వహించిన అభినందన సభలో ఇరువురు విద్యార్థులను పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. ఈ సందర్భంగా కోటయ్య మాట్లాడుతూ.. గత నెల 31వ తేదీన కర్నూలు అవుట్‌డోర్ స్టేడియంలో నిర్వహించిన ఉమ్మడి కర్నూలు జిల్లా జూనియర్ సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు శ్రీకాకుళంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలలో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పీడీ దాదాపీర్, ఉపాధ్యాయులు ఐడికే శాస్త్రి, నారాయణమూర్తి, శివశంకర్, రవీంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

లైన్‌మెన్ మృతికి సంతాపం


సుంకయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఉయ్యాలవాడ: మండలంలోని అల్లూరు గ్రామంలో విద్యుత్ లైన్‌మెన్ మృతికి మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి నివాళులర్పించారు. లైన్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తున్న సుంకయ్య ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై బుధవారం మృతి చెందిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి గురువారం మృతుడి స్వగ్రామమైన హరివరం గ్రామానికి చేరుకుని కుటుంబాన్ని పరామర్శించి నివాళులర్పించి, సంతాపం తెలిపారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీఇచ్చారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ పల్లె మహేశ్వరరెడ్డి, రూపనగుడి గ్రామ సర్పంచ్ దేశం సోమశేఖర్‌రెడ్డి, దంత వైద్య నిపుణులు నాగేశ్వరరెడ్డి, నాయకులు గజ్జెల కృష్ణారెడ్డి, తరిగోపుల ప్రసాద్‌రెడ్డి, ఆరికట్ల శివరామక్రిష్ణారెడ్డి, తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

98 శాతం పింఛన్ల పంపిణీ


డబ్ల్యూ గోవిందిన్నెలో గ్రామ సచివాలయం ఆవరణలో పింఛన్ల పంపిణీ

ఉయ్యాలవాడ: మండలంలో తొలిరోజు 98 శాతం మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ రఘురాం తెలిపారు. గురువారం రూపనగుడి, ఉయ్యాలవాడ, ఇంజేడు, సుద్దమల్ల, మాయలూరు గ్రామాల్లో పింఛన్ల పంపిణీ తీరును ఎంపీడీఓ పరిశీలించారు. 11 గ్రామ సచివాలయాల పరిధిలో 3,904 మంది లబ్ధిదారులకుగాను 3,834 మందికి పింఛన్లు అందించినట్లు వెల్లడించారు. ఆర్.పాంపల్లె గ్రామంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ భూపాల్ రెడ్డి ఉదయం పింఛన్లు పంపిణీ చేసేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్లగా వీధి కుక్క దాడి చేసి కరిచింది. వెంటనే ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చికిత్స తీసుకున్న అనంతరం తిరిగి గ్రామానికి చేరుకుని పింఛన్లు పంపిణీ చేశారు.

దొర్నిపాడు: మండలంలో మొత్తం 3,730 పింఛనుదారులకు గాను తొలిరోజు 96.63 శాతం మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. డబ్లూ గోవిందిన్నె గ్రామంలో సచివాలయ ఆవరణలో పింఛన్లు పంపిణీ చేశారు.

రుద్రవరం: మండలంలోని 16 గ్రామ సచివాలయాల పరిధిలో ఉద్యోగులు ఉదయం నుంచే పింఛన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. మొత్తం 6,352 మందికిగాను సాయంత్రానికి 6130 మందికి సొమ్ము అందించినట్లు ఎంపీడీఓ రామచంద్ర తెలిపారు. మారుమూల పల్లెల్లో సర్వర్ పనిచేయకపోవడంతో రోడ్డుపై నిలిచి సొమ్ము అందజేశారు.

పింఛన్ల పంపిణీని పూర్తి చేయాలి


పింఛన్లను పంపిణీ చేస్తున్న శ్రీధర్‌రెడ్డి

నంద్యాల(అర్బన్): జిల్లాలో చేపట్టిన ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని త్వరగా పూర్తి చేయాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి సూచించారు. మండలంలోని అయ్యలూరు గ్రామ సచివాలయం 1, 2 పరిధిలో గురువారం ఆయన పింఛన్ల పంపిణీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ సకాలంలో పంపిణీని పూర్తి చేసి ఇతర జిల్లాలకు ఆదర్శంగా నిలవాలని సూచించారు.

8న ఎస్‌ఎంసీ ఎన్నికలు

ఉయ్యాలవాడ: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 8వ తేదీన మండలంలోని 32 పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ వీరప్రతాప్‌రెడ్డి గురువారం తెలిపారు. ఈ మేరకు అన్ని పాఠశాలల్లో ఎన్నికల ప్రకటన, ఓటర్ల జాబితాను నోటీసు బోర్డులో ప్రదర్శించడం జరిగిందన్నారు. జాబితాలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే 5వ తేదీన సవరణలు చేసి తుది జాబితాను అదే రోజు నోటీస్ బోర్డులో ప్రదర్శిస్తామన్నారు. 8వ తేదీ ఉదయం ఎన్నికల నిర్వహణ, అదే రోజు సాయంత్రం అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడిచే ప్రమాణ స్వీకారం అనంతరం తల్లిదండ్రులతో ఆయా పాఠశాలల్లో హెచ్‌ఎంలు మొదటి సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు.

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

నందికొట్కూరు: నేషనల్ హైవే రోడ్డు నిర్మాణ కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని హంద్రీనీవా కాలువ అడ్డంగా వేసిన రోడ్డును సీపీఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలు–అమరావతి నేషనల్ హైవే రోడ్డు నిర్మాణం పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ హంద్రీనీవా అధికారులకు సమాచారం ఇవ్వకుండా కాలువకు అడ్డంగా మట్టి వేయడం తగదన్నారు. రాకపోకలకు ఎలాంటి అంతరాయం లేని పాతబ్రిడ్జిని కూల్చడం దుర్మార్గమన్నారు. కృష్ణ, తుంగభద్ర నదులు పొంగిపొర్లుతూ లక్షల క్యూసెక్కుల నీరు వృథాగా సముద్రం పాలవుతుందన్నారు. కర్నూలు, అనంతపురం, సత్యసాయి జిల్లాల్లో పంటలు ఎండిపోతుంటే హంద్రీనీవా ద్వారా కర్నూలు జిల్లాలో చెరువులన్నీ నింపడానికి అవకాశం ఉన్నా, అనంతపురానికి నీళ్లు వదలడానికి అవకాశం ఉన్నా నిర్లక్ష్యం చేయడం సరైంది కాదన్నారు. నీళ్లు వదలకుండా ఆటంకం కలిగించిన నేషనల్ హైవే కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, నాయకులు రాధాకృష్ణ, రామకృష్ణ, నారాయణ, స్థానిక నాయకులు రాఘవేంద్ర, మృత్యుంజయ్ ఉన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై రాజమహేంద్రవరం, దవళేశ్వరానికి చెందిన రాధాకృష్ణ సంగీత నృత్యకళా క్షేత్ర వారి సంప్రదాయ నృత్యం అలరించింది. వినాయకకౌత్వం, మహాగణపతిం, లింగాష్టకం, కాలభైరవాష్టకం, కనకధారాస్తోత్రం, ఆనందతాండవం తదితర గీతాలకు, అష్టకాలకు లక్ష్మీదీపిక, హర్షిత, అమృత, కార్తికేయని, భవ్యతేజస్విని, కీర్తి పర్ణిక, శరణ్య, పూజ, వర్షిణి, ప్రణీత, కావ్య, భవ్య సిరిచందన, ప్రణవి, కిరణ్మయి తదితరులు నృత్య ప్రదర్శన చేశారు.

సుప్రీం తీర్పు మాదిగల విజయం



మాట్లాడుతున్న దండు వీరయ్య మాదిగ

నంద్యాల(అర్బన్): ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మాదిగల విజయమని ఏపీ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ, మాదిగ విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బాయికాటి బెనర్జీ మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో జరిగిన ముఖ్యనాయకుల సమావేశంలో దండు వీరయ్య మాదిగ మాట్లాడుతూ 30 ఏళ్లుగా మాదిగలు ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం చేసిన ఫలితమే సుప్రీంకోర్టు తీర్పు అన్నారు. బెనర్జీ మాదిగ మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పుతో మాదిగల న్యాయం గెలిచిందన్నారు. వర్గీకరణకు మద్దతు తెలిపిన ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, ఎన్‌డీఏ కూటమిలోని భాగస్వాములకు ధన్యావాదాలు తెలిపారు. కార్యక్రమంలో 1వ వార్డు కౌన్సిలర్ నాగార్జున మాదిగ, సాయి, రామచంద్రుడు, రవీంద్రనాయక్, నరసింహ మాదిగ, కోటేష్ మాదిగ, రవికిరణ్ మాదిగ, వెంకటేశ్వర్లు మాదిగ, ఇమ్మానియేల్ మాదిగ పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి స్కౌట్స్, గైడ్స్‌లో చేరాలి


గౌరవ వందనం స్వీకరిస్తున్న దృశ్యం

గోస్పాడు: ప్రతి విద్యార్థి స్కౌట్స్, గైడ్స్‌లో చేరాలని మార్క్‌ఫెడ్ రాష్ట్ర మాజీ చైర్మన్ పీపీ నాగిరెడ్డి అన్నారు. మండలంలోని దీబగుంట్ల హైస్కూల్‌లో గురువారం స్కార్ఫ్ డేను హెచ్‌ఎం నాగలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సమన్వయ నిర్వహణ, నాయకత్వం, చొరవ, ప్రణాళిక, స్వీయ ప్రేరణ, సాంస్కృతిక అవగాహన వంటి నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. అనంతరం గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో పీడీ విశ్వనాథ్, స్కౌట్స్ మాస్టర్ రమేష్‌నాయక్, గైడ్ టీచర్ వెంకటలక్ష్మమ్మ పాల్గొన్నారు.

సాంస్కృతిక పోటీలు ప్రారంభం


కళారాధన సాంస్కృతిక పోటీలను ప్రారంభిస్తున్న రామకృష్ణారెడ్డి

నంద్యాల(వ్యవసాయం): స్థానిక రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో స్వాతంత్ర్య దినోత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సాంస్కృతిక పోటీలను గురువారం రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ కళారాధన సాంస్కృతిక సంస్థ ఇలాంటి దేశభక్తి భావాలను పెంపొందించే కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కళారాధన అధ్యక్షులు డాక్టర్ మధుసూదన్‌రావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ కళారాధన రజతోత్సవాల్లో భాగంగా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కళారాధన కార్యనిర్వాహక కార్యదర్శి రవిప్రకాష్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు నిజాముద్దీన్, కార్యదర్శి శిరిగిరి రమేష్, కోశాధికారి మామిళ్ల నాగరాజు, కళారాధన యువజన విభాగం అధ్యక్షులు రంగనాథ్ పాల్గొన్నారు.

- మొదటి రోజు లఘు చలనచిత్ర విశ్లేషణ, చిత్రపట విశ్లేషణ తదితర పోటీలు జరిగాయి.
- శుక్రవారం వివేకానంద ఆడిటోరియంలో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ చిన్నారులకు ఆంగ్ల రైమ్స్, సబ్ జూనియర్, జూనియర్ విభాగాల్లో తెలుగు పద్య పఠనం పోటీలు నిర్వహించనున్నారు.
- శని, ఆదివారాల్లో దేశభక్తి, సాధారణ, జానపద, శాస్త్రీయ పాటల పోటీలు సోలో, బృంద విభాగాల్లో సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ కేటగిరీల్లో, సోలో, వాద్య, సంగీతం పోటీలు ఉంటాయి.

నందీశ్వరుడికి ప్రదోషకాల అభిషేకం

మహానంది: మహానందిలో కొలువైన మహానందీశ్వర గర్భాలయం ఎదురుగా ఉన్న నందీశ్వరుడికి గురువారం ప్రదోష కాలంలో నందీశ్వరాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, ప్రధాన అర్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, అర్చకులు గణపతిపూజ, పుణ్యాహవాచనం, తదితర పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని పూజలు నిర్వహించారు.

తల్లి పాలు బిడ్డకు శ్రేష్టం


ఉయ్యాలవాడ పీహెచ్‌సీలో అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారిణి అపర్ణ


రుద్రవరంలో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి


చాగలమర్రిలో అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అంజలి


పోస్టల్‌ను ప్రారంభిస్తున్న ఐసీడీఎస్ సీడీపీఓ చంద్రకళ

ఉయ్యాలవాడ: ప్రపంచ తల్లి పాల వారోత్సవాలను విజయవంతం చేద్దామని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి అపర్ణ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక 24 గంటల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వారోత్సవాలను పురస్కరించుకుని గర్భిణులు, బాలింతలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తల్లి పాలు బిడ్డకు తాపడం ద్వారా రోగ నిరోధక శక్తితో పాటు సంపూర్ణ పోషణ లభిస్తుందన్నారు. బిడ్డ పుట్టిన గంటలోగా ముర్రుపాలు తాగించాలన్నారు. బిడ్డకు 6 నెలలు వచ్చే వరకు తల్లి పాలు మాత్రమే ఇవ్వాలని, ఇతర ద్రవ పదార్థాలు ఇవ్వరాదన్నారు. తల్లి పాలు ఇవ్వడం వల్ల బిడ్డకు తల్లికి ప్రేమానుబంధం పెరుగుతుందన్నారు. ఎంపీహెచ్‌ఓ దస్తగిరి, హెల్త్ సూపర్‌వైజర్ రామచంద్రుడు, లక్ష్మిదేవి, ఉమామహేశ్వరి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రుద్రవరం: బిడ్డ పుట్టిన గంటలోపే తల్లి పాలు పట్టాలని అంగన్‌వాడీ కేంద్రాల సూపర్‌వైజర్ లక్ష్మీదేవి సూచించారు. రుద్రవరంలోని 7వ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం తల్లి పాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించి గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. బిడ్డకు ఆరు నెలల వరకు తల్లి పాలు పట్టాలని, 7వ నెల నుంచి రెండేళ్ల వరకు అనుబంధ ఆహారంతో పాటు తల్లిపాలు పట్టాలని సూచించారు. డబ్బా పాలు పట్టడం వల్ల కలిగే నష్టాలను వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్త సువర్ణ తదితరులు ఉన్నారు.

చాగలమర్రి: బిడ్డకు తల్లి పాలే శ్రేష్టం అని, పుట్టిన గంటలోపు శిశువుకు ముర్రుపాలు తాగించాలని మండల ప్రభుత్వ వైద్యాధికారిణి అంజలి సూచించారు. ఆమె గురువారం చాగలమర్రిలోని పాత ఎస్సీ కాలనీ 8వ అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన తల్లి పాల వారోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ తల్లి పాలు పట్టడం వల్ల బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని, తల్లీ, బిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. అలాగే కదిరిపురం తండాలోని అంగన్‌వాడీ కేంద్రంలో బాల కుళ్లాయమ్మ ఆధ్వర్యంలో బాలింతలు, గర్భిణులకు తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్త మహబుబ్‌చాన్, సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలు ఇచ్చే తల్లులకు మద్దతు ఇద్దాం

నంద్యాల(అర్బన్): పాలిచ్చే తల్లులందరికీ మద్దతు ఇద్దామని ఐసీడీఎస్ నంద్యాల అర్బన్ ప్రాజెక్టు సీడీపీఓ చంద్రకళ అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక ఆత్మకూరు బస్టాండ్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ వర్కర్లతో కలిసి వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. బిడ్డ జన్మించిన గంటలోపే ముర్రుపాలు పట్టాలని, తల్లి పాలు బిడ్డకు మొదటి టీకా లాంటిదన్నారు. ప్రతి తల్లి బిడ్డకు పాలు ఇవ్వాల్సిన బాధ్యత ఉందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నజీరా పాల్గొన్నారు.

నంద్యాల(న్యూటౌన్): తల్లిపాలు పిల్లలకు శ్రేయస్కరమని, పిల్లలకు పాలు పట్టడంలో ఎలాంటి అపోహలు పెట్టుకోకూడదని ఐఎంఏ అధ్యక్షురాలు డాక్టర్ వసుదరాణి సూచించారు. గురువారం రామకృష్ణ అటానమస్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రపంచ తల్లి పాల దినోత్సవంలో ఆమె మాట్లాడారు. కళాశాల చైర్మన్ రామకృష్ణారెడ్డి, మేనేజర్ ప్రగతిరెడ్డి, డాక్టర్ సంతప్‌కుమార్, ప్రిన్సిపాల్ సుబ్బయ్య పాల్గొన్నారు.

రహదారికి పచ్చటి తోరణం


శిరివెళ్ల– రుద్రవరం రస్తాలో బిసర చెట్లు

శిరివెళ్ల: మండల పరిధిలో శిరివెళ్ల– రుద్రవరం ఆర్ అండ్‌బీ రోడ్డుకు ఇరుపక్కలా నాటిన బిసర మొక్కలు నేడు చెట్లుగా పెరిగి రోడ్డుకు అందాన్ని ఇస్తున్నాయి. ప్రకృతికి శోభనిస్తూ ప్రయాణికులను ఆకర్షితున్నాయి. ఎండల నుంచి వాహనదారులకు నీడ ఇస్తున్నాయి. 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగానే జగనన్న పచ్చతోరణం కింద ఉపాధి పథకం, అటవీ శాఖ సిబ్బంది పొలాల గట్లు, రోడ్లకు ఇరు వైపులా కానుగ, కొండ సుంకేసుల, బిసర మొక్కలను నాటించారు. అవి నేడు చెట్లుగా పెరిగాయి. మొక్కల పెంపకానికి నాటి ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు ఉపాధి కూలీలకు వేతనాలు ఇచ్చి మొక్కలకు నీరు పోసి పరిరక్షించేలా చర్యలు చేపట్టింది. దీంతో మొక్కలు పెద్దగా పెరిగి రహదారికి పచ్చటి తోరణంలా దర్శనమిస్తున్నాయి.